https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

## తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

4 PM TO 7 PM

సంపుటి: 01 | సంచిక:20 | పేజీలు :02 | వేల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | శనివారం, సెప్టెంబర్ 05,2026

## హైదరాబాద్‌లో దేశంలోనే

# అతిపెద్ద AI డేటా సెంటర్

### రూ.70 వేల కోట్ల పెట్టుబడి - 7 వేల మందికి ఉద్యోగాలు

### టీసీఎస్ -హైపర్ వాల్ట్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 5:**

హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్? అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. టీసీఎస్? ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో శనివారం సచివాలయంలో సమావేశమైంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీసీఎస్? సీఈఓ కె. కృతివాసన్, సీఓఓ ఆర్తి సుబ్రమణియన్, హైపర్? వాల్ట్ ప్రెసిడెంట్ వి. రాజన్న, హైపర్? వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒపెన్? ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్? వాల్ట్ తో పాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటు లోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు.దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణకే కాకుండా దేశానికి ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని అన్నారు.ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని అభి ,ప్రాయపడ్డారు.ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని అన్నారు.తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభి నందించారు. ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. టీసీఎస్? తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడ నున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది.అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసు కొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది.

# "మహిళలు శక్తి స్వరూపిణిలు - నవశక్తులు మాలోనే""

# అనే థీమ్ తో రాబోవు దసరాకు మహిళా సాంస్కృతి కోత్సవాలు

### - అక్టోబర్ 4వ రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో నిర్వహణకు భారీ ఏర్పాట్లు.

### - ఈ సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించినఆర్ ఐ ఓ శారద

(బై రాజా పెంట పాటీ బ్యూరో చీఫ్ ఏపీ)

**అమరావతి సెప్టెంబర్ 5 ట్రై నెట్ (ఏపీ)**

మహిళలకు ప్రత్యేకంగా సాంస్కృతి కోత్సవాలు నిర్వహించడం మంచి నిర్ణయం అని ఆమె అన్నారు. అమ్మాయిలు మహిళలలో అనేక రకాల ప్రతిభా పాటవాలు ఉన్నాయని, వాటిని ప్రదర్శించడానికి తరుణీ తరంగిణి లాంటి వేదికలు ఉపయోగపడతాయని ఆమె అన్నారు. ఈ సందర్భంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో కాలేజీ విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఇలాంటి వేదికలను ఉపయోగించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు పి తులసి మాట్లాడుతూ ఈ మహిళా ఉత్సవాలకు తరుణీ తరంగిణీ సెలబ్రేటింగ్ హెర్ పవర్ గ్రేస్ అండ్ గ్లోరీ అనే ట్యాగ్ లైన్ పెట్టామని »»Celebrating Her Power, Grace & Gloryµµ అంటే కేవలం మహిళను పొగడటం కాదు --- ఆమె శక్తిని గుర్తించి, ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవించి, ఆమె విజయాలను సంబరంగా జరుపుకోవడం అనే విస్తృతమైన భావం ఇందులో ఇమిడి ఉందని ఆమె తెలిపారు. """మేము ఆధునిక మహిళలం నవదుర్గలం మేము నవశక్తులు మాలోనే"" అనే థీమ్ తో ఈ దసరాకు మహిళా సాంస్కృతి కోత్సవాలు అక్టోబర్ 4వ తారీఖున ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో అమ్మాయిలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.





# కోవిడ్ టీకాలతో 28 మంది సైనికులు మృతి : అమెరికా ఆర్మీ డాక్టర్

**న్యూయార్క్: సెప్టెంబర్ 5 (ట్రైనెట్ న్యూస్)**


కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల 28 మంది సైనికులు మృతిచెందినట్లు ఓ అమెరికా ఆర్మీ డాక్టర్ కోర్టులో తెలిపారు. దీనిపై పొలిటికో వార్తాసంస్థ ఓ కథనాన్ని రాసింది. కోవిడ్ టీకా వల్ల సుమారు 2544 మంది మృతిచెందిన ఘటనలో అమెరికా ప్రభుత్వం దర్యాప్తు చేపడుతున్నది. అమెరికా ఆరోగ్యశాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్‌కు అడ్వైజర్‌గా చేస్తున్న థెరిసా లాంగ్ ఈ విషయాన్ని వర్జీనియా కోర్టులో చెప్పినట్లు తెలుస్తోంది. వ్యాక్సిన్ అడ్వర్స్ ఈవెంట్ రిపోర్టింగ్ సిస్టమ్‌కు సుమారు 2544 మృతుల సమాచారం అందినట్లు లాంగ్ తన వాంగ్మూలంలో వెల్లడించారు.మిలిటరీ సిబ్బంది కోవిడ్ టీకా తీసుకోవాలని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశించారు. లేదంటే విధుల నుంచి తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కోవిడ్ టీకా తీసుకోని 9వేల మందిని తొలగించారు. ఇక దేశాధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ఆ తొలగించిన సైనికులను మళ్లీ విధుల్లో చేర్చుకున్నారు. ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ ద్వారా కోవిడ్19 టీకాను వేగంగా, భారీ స్థాయిలో ఉత్పత్తి చేశారు. అయితే తమ వ్యాక్సిన్ల వల్ల స్వల్ప స్థాయిలో గుండె కణజాలం వాపునకు గురయ్యే అవకాశాలు ఉన్నట్లు ఫైజర్, మోడెర్నా సంస్థలు పేర్కొన్న విషయం తెలిసిందే.

# ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టం కేసులలో

# చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడేలా వ్యవస్థ పనిచేయాలి

### క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలి - ముఖ్య మంత్రి ఆదేశాలు.

(బై రాజా పెంట పాటీ బ్యూరో చీఫ్ ఏపీ)



**అమరావతి సెప్టెంబర్ 5 ట్రై నెట్ (ఏపీ)**

ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టం కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, దోషులకు వీలైనంత త్వరగా శిక్ష పడేలా చూడాలని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, నేరాలకు పాల్పడిన వారికి సక్రమంగా శిక్ష పడేలా వ్యవస్థ పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టం అమలు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల కమిటీ నేడు ముఖ్యమంత్రి క్యాంప్ కార్యా లయంలో సమావేశమైంది.గుంటూరు, అనంతపురం, తూర్పు గోదావరి, ప్రకాశం జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలపై నమోదవుతున్న అధిక సంఖ్యలోని అఘాయిత్య కేసులపై ప్రత్యేక అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న 131 జిల్లా స్థాయి సమావేశాలపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన వారిని ఆదేశించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ తన నివేదికను సమర్పించి రెండున్నర దశాబ్దాలు గడిచిన నేపథ్యంలో, ఆనాటి పరిస్థితులు, అప్పటి నుంచి వచ్చిన మార్పులపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఐఐటీలు, ఐఐఎంల వంటి ప్రతిష్టాత్మక సంస్థలలో ప్రవేశానికి పోటీపడేలా వారిని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు.ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. పీ4, ఎంబీకే 10-20 వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ఎస్సీ, ఎస్టీల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరచవచ్చని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన వర్గాల ఆదాయాలను పెంచడానికి కాఫీ, అటవీ ఉత్పత్తుల వంటి వాణిజ్య పంటల ద్వారా అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని ఆయన వివరించారు.ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వసతి గృహాలలో నెట్ జీరో విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంత్రులు డి.బి.వి. స్వామి, వి. అనిత, జి. సంధ్యారాణి, ఎంపీలు కృష్ణ ప్రసాద్, డి. ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

రాజా పెంట పాటీ అమరావతి ఏపీ

# ఏపీ పెన్షనర్ల ఆరోగ్య సేవల సమన్వయ సమావేశం







**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ట్రైనెట్ న్యూస్):**

అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో "ఏపీ పెన్షనర్స్ హెల్త్ సర్వీసెస్ కోఆర్డినేషన్ మీటింగ్" శనివారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన మందిరంలో నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ సమావేశంలో పెన్షనర్లకు అందుతున్న ఆరోగ్య సేవలు, వైద్య సదుపాయాలు, వాటి సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ డీజీఎం కె. సుధాకర్ రెడ్డి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల జిల్లా కోఆర్డినేటర్ డా. టి. రంగస్వామి రెడ్డి, ప్రైమ్9 టీవీ ఛానల్ సీఈఓ పి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు చెందిన మార్కెటింగ్ విభాగాల ప్రతినిధులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. గౌరవ అతిథిగా ఈజీలైఫ్ మొబిలిటీ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ డా. హిమ బిందు నల్లూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వ వైద్య పథకాలు, కార్పొరేట్ ఆసుపత్రుల సహకారం, వైద్య సేవల వినియోగంలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమావేశంలో చర్చించారు. పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వక్తలు ప్రస్తావించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె. నళినీ మోహన్ కుమార్, ప్రధాన కార్యదర్శి టి.ఎం.బి. బుచ్చిరాజు, కార్యవర్గ సభ్యులు, పెన్షనర్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..
## లష్కరే కమాండర్ యాసిర్ హతం..!

**సెప్టెంబర్ 5 (ట్రైనెట్ న్యూస్)**

జమ్ముకశ్మీర్ లో ఉగ్రవాదుల ఏరివేత ప్రక్రియ కొనసాగుతున్నది. ఇవాళ మధ్య కశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లా లో భద్రతా బలగాల కు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా కమాండర్ యాసిర్ హతమయ్యాడు. యూస్‌మార్గ్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. యూస్‌మార్గ్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై నిఘా వర్గాల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్, 53 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు సంయుక్తంగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ కాల్పుల్లో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. యాసిర్ గతంలో లష్కరే తోయిబాలోని సులేమాన్ మూసా గ్రూప్‌లో సభ్యుడిగా ఉండేవాడని, అయితే సుమారు ఏడాది క్రితం ఆ విభాగం నుంచి విడిపోయి సొంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా యూస్‌మార్గ్ పరిసర ప్రాంతాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు. యాసిర్ మృతి నేపథ్యంలో అతడి నెట్‌వర్క్, లష్కరే సభ్యులతో ఉన్న సంబంధాలు, అలాగే ఇటీవల జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో అతడి ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. కాగా 2025 పహల్గామ్ ఉగ్రదాడికి సూత్రధారి అయిన సులేమాన్ మూసాను గతంలోనే భద్రతా బలగాలు హతమార్చాయి. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్లలో యాసిర్ ఎన్‌కౌంటర్ కీలక విజయమని అధికారులు పేర్కొన్నారు.





# సీఎం రేవంత్ రెడ్డిని నేనెప్పుడూ దూషించలేదు..
### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యూటర్న్

**సెప్టెంబర్ 5 (ట్రైనెట్ న్యూస్)**



కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య పదవుల పంచాయతీ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. పార్టీలో జరుగుతున్న వ్యవహారాలపై, పార్టీ నాయకత్వంపై చేసిన ప్రతికూల వ్యాఖ్యలను సమయాన్ని బట్టి తమకు అనుకూలంగా మలచుకోవడం కనిపిస్తుంటుంది. మంత్రి పదవి విషయంలో అసంతృప్తిగా ఉన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎప్పటికప్పుడు రేవంత్ సర్కార్‌పై తనదైన శైలిలో సెటైర్లు వేస్తూ హాట్ టాపిక్‌గా నిలిచారు. రేవంత్ రెడ్డికి, పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఇద్దరికి బుద్ధి లేదు.. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి బుద్ధి లేదు.. ఆయనను పార్టీలోకి తీసుకున్న రేవంత్ రెడ్డికి బుద్ధి లేదంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారని తెలిసిందే. అయితే కొండా సురేఖను బర్తరఫ్ చేసిన తర్వాత నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యూటర్న్ తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిని నేనెప్పుడూ దూషించలేదని.. ఒకటి, రెండు అంశాల్లో మాత్రమే విభేదించానని అన్నారు. రేవంత్ రెడ్డితో నాకు ఎలాంటి విభేదాలు లేవు. కొడంగల్, మధిర స్థాయిలో నా నియోజకవర్గానికి నిధులు వచ్చాయి. మునుగోడుకు రూ.2 వేల కోట్ల నిధులు వచ్చాయన్నారు. అంతేకాదు సీఎం సభకు వేలాది మంది కార్యకర్తలతో వెళ్తా.. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై అధిష్టానానిదే ఫైనల్ నిర్ణయం అంటూ చెప్పుకొచ్చారు. ఇప్పుడీ కామెంట్స్ రాజకీయ వర్గాల్లో చర్చకు తెరలేపాయి.

# గత కొంత కాలంగా పెండింగ్ బకాయిలు పై ఆందోళన చేస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు ముఖ్య మంత్రితో జరిపిన చర్చలు సఫలీకృతం కావడంతో సంతోషం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు.

**(బై రాజా పెంట పాటీ బ్యూరో చీఫ్ ఏపీ)**



**అమరావతి సెప్టెంబర్ 5 ట్రై నెట్ (ఏపీ)**


ఉద్యోగులు ప్రభుత్వంలో అంతర్భాగమని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొంటూ, ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ఈరోజు పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు. ముఖ్యమంత్రి ఈరోజు ఉద్యోగుల సంఘాల నాయకులతో చర్చలు జరిపి పలు నిర్ణయాలను ప్రకటించారు. ఈ ప్రకటనలపై ఉద్యోగుల సంఘాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. 12వ వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ) ఏర్పాటుకు అంగీకారం. అక్టోబర్ 1, 2026 నుండి పెండింగ్‌లో ఉన్న రెండు కరువు భత్యాల (డీఏ) చెల్లింపు. జూలై 1, 2024 మరియు జనవరి 1, 2025 నుండి రావలసిన డీఏల విడుదల. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవ్ మొత్తాన్ని రాబోయే సంక్రాంతి నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ఒప్పందం. రాబోయే దసరా పండుగ సందర్భంగా పోలీసు సిబ్బందికి ఒక అదనపు సరెండర్ లీవ్ చెల్లింపు. జనవరి 2027 నుండి అదనపు పెన్షన్ మొత్తాన్ని అమలు చేయడం. 70 ఏళ్లు పైబడిన పెన్షనర్లు అదనంగా 10 శాతం పెన్షన్ పొందుతారు, అదే సమయంలో 75 ఏళ్లు పైబడిన వారు అదనంగా 15 శాతం పొందుతారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) క్రమబద్ధీకరించబడుతుంది. వచ్చే నెల నుండి, ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌కు నెలవారీ చెల్లింపులు చేస్తుంది. ముఖ్యమంత్రి ప్రకటించిన ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ. 2,880 కోట్ల అదనపు భారం పడుతుంది. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ఆచరణాత్మక చర్యలు తీసుకుంటూనే, వారి సంక్షేమం మరియు శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఉద్యోగుల సంఘాల నాయకులతో చర్చలు జరిపి పలు నిర్ణయాలపై ఉద్యోగుల సంఘాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# బీఎల్‌ఏ దాడిలో 25 మంది పాక్ సైనికులు మృతి..
# స్పందించని పాక్

**సెప్టెంబర్ 5 (ట్రైనెట్ న్యూస్)**



పాకిస్తాన్‌లో కొంతకాలంగా పాక్ సైన్యానికి, బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)కు మధ్య భీకర పోరు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇరుపక్షాలు పరస్పరం దాడి చేసుకుంటున్నాయి. తాజాగా బీఎల్ఏ జరిపిన దాడిలో 25 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. ఈ విషయాన్ని బీఎల్ఏ తాజాగా వెల్లడించింది. పాక్ దాడులకు బదులుగా, బీఎల్ఏ జరిపిన వేర్వేరు దాడుల్లో పాక్ సైనికులు మరణించినట్లు తెలిపింది. దీంతో బెలూచిస్తాన్ ప్రాంతంలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కూడా బీఎల్ఏ రిలీజ్ చేసింది. బీఎల్ఏకు చెందిన ఫతేహ్ స్క్వాడ్ ఈ దాడి చేసినట్లు ప్రకటించింది. శుక్రవారం జియారత్ క్రాస్ వద్ద పాక్ మిలిటరీ కాన్వాయ్‌కు చెందిన రెండు వాహనాలు వెళ్తుండగా బీఎల్ఏ దాడి చేసింది. ఈ ఘటనలో 18 మంది పాక్ సైనికులు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. ఫతేహ్ స్క్వాడ్.. బీఎల్ఏలో చాలా బలమైన సాయుధ రెబల్ గ్రూప్. బెలూచిస్తాన్ పర్వత ప్రాంతాల్లో, గ్వెరిల్లా తరహా మెరుపు దాడులు చేయగల సామర్థ్యం ఈ గ్రూప్ సొంతం. ప్రమాదకరమైన దాడుల్ని ఈ గ్రూప్ చేపడుతుంది. గత ఏడాది మార్చిలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసింది కూడా ఈ గ్రూపే. మరో ఘటన సూరబ్ పరిధిలోని హజికా ప్రాంతంలో జరిగింది. బీఎల్ఏకు చెందిన ఎస్‌టీఓఎస్ గ్రూపు పాక్ సైన్యంపై దాడి చేసింది. రిమోట్ కంట్రోల్ వాహనంతో దాడి చేయగా, ఏడుగురు సైనికులు మరణించారు. ఈ రెండు దాడులపై పాక్ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. ఈ ఘటనలు పాక్ సైన్యం వైఫల్యంగా అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ వైఫల్యంగా స్థానికులు ఆరోపిస్తున్నారు. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెలూచిస్తాన్‌లో కొంత కాలంగా ఆందోళనలు జరుగుతున్నాయి. బలూచ్ పౌరులు తమను తాము స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. పాక్ ప్రభుత్వం నుంచి విముక్తి కావాలని కోరుకుంటూ పోరాటం చేస్తున్నారు. అయితే, పాక్ ప్రభుత్వం మాత్రం ఈ ఉద్యమాన్ని తీవ్రంగా అణిచివేస్తోంది.



# నేపాల్‌లో విరిగిపడ్డ కొండచరియలు.. మళ్లీ వరదలు ముంచెత్తే ప్రమాదం..!

**సెప్టెంబర్ 5 (ట్రైనెట్ న్యూస్)**

హిమానీనదం విరిగిపడి భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్ ను మరో ముప్పు వెంటాడుతోంది. తాజాగా జారీచేసిన వరద ప్రమాద హెచ్చరికలు ఆ దేశాన్ని తీవ్రంగా భయపెడుతున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో దార్చులా జిల్లాలోని భట్టార్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి చౌలానీ నది ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. కొండలపై నుంచి జారిపడిన రాళ్లు, మట్టితో నదీ ప్రవాహం పాక్షికంగా నిలిచిపోయింది. దాంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాళ్లు తొలగిపోతే ఒక్కసారిగా దిగువ ప్రాంతాలను వరద ముంచెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలోనే నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది. పరిస్థితిని పర్యవేక్షించేందుకు పోలీసులను రంగంలోకి దించింది. సహాయక చర్యల కోసం అత్యవసర ఫోన్ నంబర్లనూ విడుదల చేసింది. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలు ఇంకా కోలు కోకముందే ఈ కొత్త ముప్పు పొంచి ఉండటం ఆందోళనకరంగా మారింది.